సీఎం రేవంత్‌రెడ్డిది డైవర్షన్ పాలిటిక్స్

● ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

హైదర్‌నగర్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్‌రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారని, రైతుభరోసా, ఆరు గ్యారెంటీల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకు కేటీఆర్‌పై ఏసీబీ కేసు నమోదు చేశారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడుతూ కేసీఆర్ కుటుంబంపై బురద చల్లడం ద్వారా తప్పుడు కేసులు పెట్టడం రేవంత్‌రెడ్డి టార్గెట్‌గా ఉందన్నారు. కేసీఆర్, కేటీఆర్‌లు అహర్నిశలు కష్టపడి హైదరాబాద్ బ్రాండ్ ఇమేజ్‌ను ప్రపంచానికి చాటిచెప్పిన వారిపై ఈ విధంగా వ్యవహరించడం తగదన్నారు. రాష్ట్రాన్ని అభివృద్ధి చేయడం మానివేసి తప్పుడు ఆరోపణలు చేస్తే బీఆర్‌ఎస్ చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. కేటీఆర్‌పై పెట్టిన తప్పుడు కేసుపై ఏసీబీ దర్యాప్తు జరుగుతుందని కేసులకు మేమేమి భయపడమని లీగల్‌గా వాటిని ఎదుర్కొంటామని పేర్కొన్నారు. డైవర్షన్ పాలిటిక్స్‌కు నిదర్శనంగా బీజేపీ, కాంగ్రెస్ కొట్లాట ఉందని, దీనికి నిదర్శనంగా పోలీసులు సమక్షంలో బీజేపీ వాళ్లపై కాంగ్రెస్ దాడులు, తిరిగి కాంగ్రెస్ వాళ్లపై బీజేపీ దాడులు చేసుకుంటున్నారని అన్నారు. రేవంత్‌రెడ్డి ఎన్ని కేసులు పెట్టినా బీఆర్‌ఎస్ భయపడదని, కేటీఆర్ ఏసీబీ, ఈడీ విచారణకు హాజరవుతారని, మచ్చలేని నాయకుడిగా నిరూపించుకుంటారని తెలిపారు.

విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలి

● కూకట్‌పల్లి ఏసీపీ వెంకటయ్య

● మూసాపేట జడ్పీహెచ్‌లో రోడ్డుభద్రతా వారోత్సవాలు


మూసాపేట పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న కూకట్‌పల్లి ఏసీపీ వెంకటయ్య

కూకట్‌పల్లి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని మత్తుకు బానిస కావద్దని కూకట్‌పల్లి ఏసీపీ వెంకటయ్య అన్నారు. బుధవారం మూసాపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు రోడ్డు భద్రతా వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు రోడ్లపై వెళ్లే సమయంలో ట్రాఫిక్ నిబంధనలు తప్పక పాటించాలన్నారు. రోజు రోజుకు రోడ్డు ప్రమాదాలు పెరుగుతున్నాయని అవగాహనతోనే ప్రమాదాలు చాలా వరకు నివారించగలమన్నారు. అతివేగం ఎంతో ప్రమాదకరమని, ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరించాలన్నారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సీఐ ముత్తుయాదవ్, ఎస్‌ఐ మురళి, ఆర్‌ఐ శేఖర్, పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు శ్రీధర్, ఉపాధ్యాయులు రాములు, అలామ్, నరేందర్, చంద్రశేఖర్ పాల్గొన్నారు.


విజేతలకు నగదు బహుమతులను అందజేస్తున్న శేరి సతీష్‌రెడ్డి తదితరులు

ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ కల్చరల్ వెల్ఫేర్ అండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నాలుగోఫేజ్ షటిల్ కోర్టు గ్రౌండ్‌లో సంక్రాంతి ముగ్గుల పోటీలు నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షుడు శేరి సతీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై ముగ్గులు వేసిన మహిళలను అభినందించారు. అనంతరం ఐదుగురు విజేతలకు నగదు, ముగ్గుల పోటీల్లో పాల్గొన్న వారందరికీ గిఫ్టులు అందజేశారు. సంక్రాంతి పండగ సమయంలో ఇలాంటి ముగ్గుల పోటీలు నిర్వహించడంలో మేము భాగస్వామ్యం కావడం సంతోషంగా ఉందని ఆయన అన్నారు. కార్యక్రమంలో సంజీవరావు, మేకల మైఖేల్, తమ్మినేని ప్రవీణ్‌కుమార్, సంధ్య, రేష్మ, నజీర్, దేవ సహాయం, రవి, లక్ష్మీ, బాబురావు, శ్రీధరాచారి, రాజు ముదిరాజ్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావుకు వినతిపత్రం అందజేస్తున్న హరి సురేష్‌బాబు తదితరులు

టీడీపీ జెండా కర్ర ధ్వంసం

కేపీహెచ్‌బీ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ ధనలక్ష్మీ సెంటర్‌లోని తెలుగుదేశం పార్టీ (టీడీపీ) దిమ్మెకు ఉన్న జెండా కర్రను గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేశారు. విషయం తెలుసుకున్న నందమూరి సుహాసిని అక్క యువసేన అధ్యక్షుడు హరి సురేష్‌బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు నిమ్మగడ్డ అరూప్, అట్లూరి దీపక్, కొడాలి రవికుమార్ చెరుకూరి రవి, సత్తార్ బుధవారం కేపీహెచ్‌బీ పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో వెంకటేశ్వరరావుకు ఫిర్యాదు చేశారు. దుండగులను గుర్తించి వెంటనే చర్యలు తీసుకోవాలని వారు కోరారు. టీడీపీ నాయకులు చందర్‌రావు, ఆలం శివ, వీరబాబు, కొల్లూరి శ్రీనివాస్, కోటేశ్వరరావు, వెంకట్, మొరంపూడి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి రైతుబజార్‌లో ధరలు ఇలా ఉన్నాయి. టమోట రూ.15, వంకాయ రూ.23, బెండకాయ రూ.45, పచ్చిమిర్చి రూ.40, బజ్జి మిర్చి రూ.23, కాకరకాయ రూ.45, బీరకాయ రూ.45, క్యాబేజీ రూ.15, బీన్స్ రూ.45, క్యారెట్ రూ.35, గోబీ పువ్వు రూ.25, దొండకాయ రూ.47, చిక్కుడు కాయ రూ.45, గోరు చిక్కుడు రూ.28, బీట్‌రూట్ రూ.35, క్యాప్సికం రూ.43, ఆలుగడ్డ రూ.25, కీర రూ.35, దోసకాయ రూ.18, సొరకాయ రూ.20, పొట్లకాయ రూ.23, కంద రూ.60, ఉల్లిపొరక రూ.35, ఉల్లిగడ్డ రూ.44, మామిడికాయ రూ.15-20, అరటికాయ రూ.8-9, చామగడ్డ రూ.37, ముల్లంగి రూ.4-5, చిలగడ దుంప రూ.40, గుమ్మడికాయ రూ.30, నిమ్మకాయలు రూ.30-40, మునగ కాయలు రూ.10-12, బొప్పాయి రూ.40, పుట్టగొడుగులు రూ.40, ఎండు మిర్చి రూ.200, అల్లం రూ.100, వెల్లుల్లి రూ.360, చింతపండు రూ.140, పండు మిర్చి రూ.80, ఉసిరి రూ.45, కరివేపాకు రూ.100, పర్వల్ రూ.55, పల్లికాయ రూ.65, లోబా రూ.25, కాకరకాయ రూ.60. పైన పేర్కొన్న ధరలు ఈరోజు ఉదయం 9.30 గంటల వరకు అందుబాటులో ఉంటాయి.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ సెక్షన్ల పరిధిలో రోడ్లపై చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏఈలు బొనిగాల విజయ ప్రకాశ్, భీమా లింగప్ప బుధవారం వేర్వేరు ప్రకటనలలో తెలిపారు. గురువారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎమ్మార్వో ఆఫీస్, పోస్టు ఆఫీస్, ఆర్‌ఆర్ చికెన్ సెంటర్, ధనలక్ష్మీ సెంటర్, సుబ్బయ్య హోటల్, మమత హాస్పిటల్, మధుసూదన్ హాస్పిటల్, ధర్మారెడ్డికాలనీ ఫేజ్-1, శివశక్తి నగర్, జనతానగర్, మారుతీనగర్, టి.అంజయ్య నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదన్నారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1, 2, 3, రవి హాస్పిటల్, ప్రసాద్ హాస్పిటల్, జీహెచ్‌ఎంసీ పార్కు, కేపీహెచ్‌బీ నాలుగో ఫేజ్, 15వ ఫేజ్‌లలో విద్యుతు సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రేపు ముక్కోటి ఏకాదశి

● ఉత్తర ద్వార దర్శనానికి కూకట్‌పల్లి ప్రసన్న వేంకటేశ్వరాలయంలో ఏర్పాట్లు పూర్తి
● దక్షిణాయన పుణ్యకాలం ప్రారంభం
● చాతుర్మాస వ్రతాలు, పూజలతో పుణ్యఫలం
● నదీ స్నానం అతి పవిత్రం

కూకట్‌పల్లి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): శ్రీదేవి భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 10న ఉదయం 5గంటలకు(ముక్కోటి ఏకాదశి) ఉత్తరద్వార దర్శనానికి అన్ని రకాల ఏర్పాట్లు చేసినట్లు ఆలయ చైర్మన్ బీడీ. రామారావు తెలిపారు. ప్రధాన అర్చకులు పృధ్వికృష్ణ, స్థానాచార్యులు కృష్ణమాచార్యులు పర్యవేక్షణలో ఆలయంలో ధనుర్మాస ఉత్సవాలు, ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహిస్తున్నారు. ఈనెల 10న వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని ఆలయంలో ఉత్తర ద్వారదర్శనం, 11న కూడారై 108 పాత్రలో క్షీర నివేదన, 13న గోదా రంగనాథస్వామి కల్యాణం ఉదయం 10గంటలకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంతో ఉత్తమమైనది శయన ఏకాదశి..

అన్ని ఏకాదశుల్లో తొలి ఏకాదశి మహావిష్ణువుకు ప్రీతికరమైనది. ఈ రోజు క్షీరాబ్ధిలో మహావిష్ణువు శయనిస్తాడు కావున ఈ ఏకాదశిని శయన ఏకాదశిగా పిలుస్తారు. స్వామి యోగనిద్రకు ఉపక్రమిస్తారు. ఏకాదశి తర్వాత వచ్చే ద్వాదశి ఘడియలో అన్నదానం చేస్తే అనంతకోటి పుణ్యఫలాలు ప్రాప్తిస్తాయి.

నదీస్నానం ఎంతో పుణ్యం..

పూర్వకాలంలో తొలి ఏకాదశి నుంచే సంవత్సరం ప్రారంభమయ్యేది. ఈ రోజు సమస్త దేవతలు నదుల్లో నడయాడతారు. అందుకే తొలి ఏకాదశిరోజు నదీ స్నానం చేయడం ఎంతో పవిత్రమైందని పురాణాలు


కూకట్‌పల్లి ప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయ గోపురం


ప్రసన్న వేంకటేశ్వస్వామి ఆలయంలో కొలువుతీరిన స్వామివారు

చెబుతున్నాయి.ఏకాదశి శివకేశవులకు ప్రీతికరమైన రోజు, ఈ రోజున గోదావరి, కృష్ణ, కావేరి, గంగానది లాంటి పవిత్ర పుణ్యనదుల్లో స్నానమాచరించి శివ, కేశవులను దర్శించుకోవాలి. సకల పాపాలు తొలగిపోతాయని, ఎంతో పుణ్యం దక్కుతుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. శివకేశవులకు కూడా అత్యంత ప్రీతికరమైన రోజు. ఈ రోజు నుంచి ఉత్తర దిశగా ఉన్న సూర్యుడు దక్షిణ దిశగా వాలుతున్నట్లు కనిపిస్తాడు. ఈ మాసం నుంచే దక్షిణాయన పుణ్యకాలం మొదలవుతుంది. దీనిని చాతుర్మాసం అని కూడా పిలుస్తారు. తొలి ఏకాదశి నుంచి కార్తీక శుద్ధ ఏకాదశి వరకు చాతుర్మాస వ్రతం అవలంబిస్తారు. వర్షాకాలంలో అనేక వ్యాధులు సంక్రమిస్తాయి. ఈ కాలంలో శాకాహారంతో ఉపవాస వ్రతం ఆచరించాలన్నది చాతుర్మాస వ్రత నియమం. ఏకాదశి తొలిరోజు ఉపవాసం ఉండి, మరుసటిరోజు హరినామపారాయణం చేసి ప్రసాదం తీసుకుని వ్రతాన్ని ముగిస్తారు. ఈ నెలలో చాతుర్మాస వ్రతాలు, పూజలు, చేస్తే ఎంతో పుణ్యం వస్తుంది.

గోశాలలో పూజలు..

గోమాత నివసించే గోశాలను తొలి ఏకాదశి రోజు శుభ్రపరచి, అలికి, రంగవల్లులతో తీర్చిదిద్ది గోశాల మధ్య భాగంలో బియ్యపు పిండితో మూడు పద్మాల ముగ్గులు పెట్టి మహాలక్ష్మిసమేత విష్ణువు ప్రతిమను ఆ పద్మాలపై ఉంచి పూజించాలి. అప్పడాలను, వాయనాలను, దక్షిణ తాంబూలాలను వచ్చిన వారికి అందించాలి. గోమాతను తొలి ఏకాదశి రోజున పూజించడం వల్ల సకల కోరికలు నెరవేరుతాయని పురాణాలు చెబుతున్నాయి.

తెలంగాణలో పిండి వంటలు ప్రత్యేకం..

తెలంగాణ పండగలు తొలి ఏకాదశి నుంచే ప్రారంభమవుతాయి. ఈరోజు పిండి వంటలు చేయడం అనాదిగా వస్తున్న ఆచారం.. పలు రకాల పిండి వంటలు పేద, ధనిక అన్న భేదం లేకుండా అందరూ చేసుకుంటారు.

ముక్కోటి దేవతలను దర్శించుకున్నా ఫలం..



వైకుంఠ ఏకాదశి రోజున ఉత్తర ద్వారం గుండా ప్రసన్న వేంకటేశ్వరస్వామిని, ముక్కోటి దేవతలను దర్శించుకున్నా ఫలం లభిస్తుందని పురాణాలు చెబుతున్నాయి. శుక్రవారం ఉదయం 5గంటల నుంచి ఉత్తరద్వార దర్శనం ప్రారంభమవుతుంది. ఈనెల 11న కూడారై, 13న గోదా రంగనాథస్వామిల కల్యాణం నిర్వహిస్తున్నాం.

- పృధ్వీకృష్ణ, ప్రధాన అర్చకులు ప్రసన్న వేంకటేశ్వరాలయం, ప్రశాంత్‌నగర్ కూకట్‌పల్లి

ప్రసన్నవేంకటేశ్వరాలయంలో అన్ని వసతులు కల్పిస్తున్నాం



కూకట్‌పల్లి ప్రసన్నవేంకటేశ్వరాలయంలో ముక్కోటి ఏకాదశి దర్శనానికి అన్ని రకాల ఏర్పాట్లు పూర్తి చేశాం. ఉత్తర ద్వారదర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని వసతులు కల్పిస్తున్నాం. శుక్రవారం 5గంటల నుంచి ప్రసన్నవేంకటేశ్వరస్వామి దర్శనం ప్రారంభమవుతుంది.

- బీ.డీ రామారావు, ప్రసన్నవేంకటేశ్వర ఆలయ చైర్మన్

ఆలయాలు ముస్తాబు


సర్దార్‌పటేల్‌నగర్‌లోని వెంకటేశ్వరస్వామి ఆలయం

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): వైకుంఠ ఏకాదశి పర్వదినం పురస్కరించుకొని కేపీహెచ్‌బీ, బాలాజీనగర్ డివిజన్ల పరిధిలోని వెంకటేశ్వరస్వామి ఆలయాలు ముస్తాభయ్యాయి. సర్దార్ పటేల్‌నగర్, శ్రీలాపార్క్‌ప్రైడ్, టెంపుల్ బస్టాపు, ఆంజనేయనగర్‌లోని ఆలయాల్లో భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారు జామున 5 గంటల నుంచే స్వామివారి ఉత్తర ద్వార దర్శనం ఉంటుందని ఆయా ఆలయాల కమిటీ నిర్వాహకులు తెలిపారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలి

● అల్లాపూర్, బాలనగర్ ప్రాంతాల్లో పర్యటించిన నగర మేయర్ విజయలక్ష్మి


సర్వే నెంబర్ 18లో కాల్వ వద్ద పరిస్థితిని పరిశీలిస్తున్న నగర మేయర్ విజయలక్ష్మి

అల్లాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): అల్లాపూర్ డివిజన్ పరిధిలోని సఫ్దర్‌నగర్, రాజీవ్‌గాంధీనగర్, అల్లాపూర్ విలేజ్ సర్వే నంబరు 18 ప్రాంతాల్లో కార్పొరేటర్ సబీహ గౌసుద్దీన్ జీహెచ్‌ఎంసీ ఇంజనీరింగ్, జల మండలి, శానిటేషన్, ఎంటమాలజీ, విద్యుత్ శాఖ అధికారులతో కలిసి జీహెచ్‌ఎంసీ మేయర్ విజయలక్ష్మి బుధవారం పర్యటించారు. ఆయా ప్రాంతాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులు, సమస్యలపై స్థానికులు మేయర్ దృష్టికి తీసుకొచ్చారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబీహ బేగం పలు వినతులతో కూడిన పత్రాన్ని మేయర్ గద్వాల విజయలక్ష్మికి అందజేశారు. ప్రధానంగా సఫ్దర్‌నగర్ డీ-బ్లాక్‌లో డ్రైనేజీ, తాగునీటి సమస్యలు, సీసీ రోడ్డు నిర్మాణం పనులు చేపట్టాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. రాజీవ్ గాంధీ నగర్, సఫ్దర్ నగర్ మధ్య స్ట్రామ్ వాటర్ డ్రైన్ ఆవశ్యకతను, రాజీవ్‌గాంధీ నగర్ సీ-బ్లాక్ వరకు భూగర్భ డ్రైనేజీ నిర్మించాలని మేయర్‌కు వివరించారు. అల్లాపూర్ విలేజ్ సర్వే నంబరు 18లోని ఖాళీ స్థలంలో మల్టీపర్పజ్ ఫంక్షన్‌హాలు, పద్మావతి నగర్‌లో కమ్యూనిటీ హాలు నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని కోరారు. సానుకూలంగా స్పందించిన మేయర్ విజయలక్ష్మి ఆయా పనులకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలని జోనల్ కమిషనర్ అపూర్వ చౌహాన్‌కు సూచించారు. కార్యక్రమంలో పలు కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్షులు, స్థానికులు పాల్గొన్నారు.


బాలనగర్‌లో ప్రజాసమస్యలను తెలుసుకుంటున్న మేయర్ విజయలక్ష్మి, బండి రమేష్

బాలనగర్‌లో దీర్ఘకాలంగా వేధిస్తున్న సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నదని మేయర్ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం బాలానగర్ పరిసర ప్రాంతాల్లో కూకట్‌పల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి బండి రమేష్, జోనల్ కమిషనరు అపూర్వ చౌహాన్‌తో కలిసి మేయర్ విస్తృతంగా పర్యటించారు. స్థానికులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ప్రజా సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.అంతకు ముందు రెండు బస్తీల మధ్య ఉన్న నాలాపై రిటైనింగ్ వాల్ నిర్మించాలని స్థానికులు మేయరకు వినతిపత్రం అందజేశారు. అక్రమ నిర్మాణాలపై స్థానికులు మేయరుకు, అధికారులకు ఫిర్యాదు చేయగా అలాంటి వాటిని తొలగించాలని కోరారు. ముఖ్యంగా ఇరుప్రాంతాల్లో దోమల బెడద అధికంగా ఉందన్న ఫిర్యాదుల మేరకు ఫాగింగ్ చేపట్టాలని సంబంధిత విభాగానికి ఆదేశించారు.

కూకట్‌పల్లిలో చైన్ స్నాచర్, బైక్ దొంగ అరెస్ట్


వివరాలను వెల్లడిస్తున్న ఏసీపీ శ్రీనివాసరావు

కేపీహెచ్‌బీకాలనీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి) : కూకట్‌పల్లిలో బైకను దొంగింలించి, అదే వాహనంపై చైన్‌స్నాచింగ్‌లకు పాల్పడుతున్న నిందితుడిని పోలీసులు అరెస్ట్ చేశారు. బుధవారం కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో ఎస్‌హెచ్‌వో కొత్తపల్లి ముత్తు, డీఐ వెంకటేశంతో కలిసి ఏసీపీ శ్రీనివాసరావు చోరీ వివరాలను వెల్లడించారు. ఏపీలోని కృష్ణాజిల్లా పామర్రుకు చెందిన కొట్టి సాయిరామ్(29) నెల రోజుల క్రితం కూకట్‌పల్లి ప్రాంతానికి వచ్చి స్థానికంగా సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. ఈనెల 3న ఓమ్ని హాస్పిటల్ వద్ద బైక్ దొంగిలించి, అదే బైక్‌పై ఈనెల 4న వివేకానందనగర్‌లో బస్టాపు నుంచి నడుచుకుంటూ వెళ్తున్న యువతి మెడలోని బంగారపు గొలుసు తెంచుకొని పారిపోయాడు. గుర్తుతెలియని వ్యక్తి బైక్‌పై వచ్చి బంగారు గొలుసు చోరీ చేశాడని బాధితురాలు, బైక్ యజమాని ఇద్దరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆయా ప్రాంతాల్లోని దాదాపు 180 సీసీ కెమెరాల ఫుటేజీని పరిశీలించగా, గొలుసు దొంగతనం చేసినది, బైకు ఎత్తుకెళ్లినది ఒకే వ్యక్తిగా గుర్తించాం. బాలానగర్ సీసీఎస్ పోలీసుల సహకారంతో బుధవారం నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారించగా దొంగతనం చేసినట్టు అంగీకరించాడు. గొలుసును ఎన్‌బీఎఫ్‌సీలో తాకట్టుపెట్టి డబ్బు తీసుకున్నాడు. ఇతనిపై ఇప్పటికే మూడు బైక్‌లు, టైర్ల దొంగతనాలు, యాక్సిడెంట్ కేసులో ఉన్నాయి. నిందితుడి అరెస్ట్ చేసి, బైక్ స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరుపరిచారు. ఇప్పటికే బంగారు చైన్ తాకట్టుపెట్టుకున్న వారికి నోటీసులు జారీచేశామని, త్వరలోనే గొలుసు స్వాధీనం చేసుకొని కోర్టుకు నివేదిస్తాన్నారు. కాగా ఏపీలో బైక్‌లు దొంగిలిస్తూ అక్కడి పోలీసులు నిఘా పెట్టడంతో హైదరాబాద్‌కు మకాం మార్చి నట్టు పోలీసులు తెలిపారు.

దుర్గంచెరువులో గుర్తుతెలియని మృతదేహం

హైదరాబాద్ సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ దుర్గంచెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం దుర్గంచెరువు నీటిపై మృతదేహం తేలడంతో మాదాపూర్ పోలీసులకు లేక్ వ్యూ సిబ్బంది సమాచారం ఇచ్చారు. మృతి చెందిన వ్యక్తి 35-40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, నలుపు రంగు టీ షర్ట్ ధరించాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'డబుల్' ఇళ్లు ఇప్పిస్తానని మోసం

● 22 మంది వద్ద డబ్బులు వసూలు చేసిన ఘరానా మోసగాడు
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
● ఆందోళనలో బాధితులు

గచ్చిబౌలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసం చేశాడు. ఓ మహిళల వద్ద డబ్బులు వసూలు చేసి ఇళ్లు ఇప్పించకుండా తప్పించుకు తిరుగుతూ పోలీసులకు సైతం చిక్కకుండా తిరుగుతున్న ఓ ఘరాన మోసగాడి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో జరిగింది. గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి 2022లో పాపిరెడ్డికాలనీకి చెందిన ఓ నిరుపేద మహిళకు తాను శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తానని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు తన చేతిలో ఉంటుందని, తనకు డబ్బులు ఇస్తే డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానని నమ్మించాడు. ఆ మహిళ తన బంధువులు, స్నేహితులు తెలిసిన వారు సుమారు 22 మందితో ఒక్కొక్కరు రూ.50 వేల చప్పున నాగరాజుకు ఇచ్చారు. వీరంతా ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న నిరుపేద మహిళలు.

అప్పులు తెచ్చి, పుస్తెల తాడు అమ్మి..

అప్పులు తెచ్చి, పుస్తెల తాడు సైతం అమ్మి నాగరాజుకు డబ్బులు ఇచ్చారు. పాపిరెడ్డికాలనీ, అంజయ్యనగర్, సిద్దిక్‌నగర్‌కు చెందిన పేదలు వీరంతా. కొంత మంది నగదు రూపంలో ఇవ్వగా మరికొందరు నాగరాజు ఫోన్‌నెంబర్ 8121800147 ఫోన్‌పే, జీపీఏ ద్వారా చెల్లించారు. గత సంవత్సరం జరిగిన ఎన్నికల ముందు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు చేశారు. ఆ సమయంలో కొంతమందికి ఇళ్ల వచ్చాయని, ఇంటినెంబర్లు సైతం మహిళలకు ఇచ్చాడు. నాగమణి అనే మహిళకు 339522, సన్నా అనే మహిళకు 339100, పద్మ 646699, రేణుకకు 268027, అనీతకు 285053, నాగుబాయి 28053, సూర్యకుమారి 650997 ఇంటినెంబర్ల గల ఇళ్ల మీకు లాటరీలో వచ్చాయని, త్వరలో మీకు అవి ఇస్తామని మహిళలను నమ్మించాడు. అప్పుడు కూడా లాటరీలో నెంబర్లు వచ్చాయి కదా మాకు ఇళ్లను చూపించాలని


పేదల సమక్షంలో పంచాయితీ నిర్వహించి చెక్కును అందజేస్తున్న దృశ్యం


నాగరాజు బంధువు భానుప్రసాద్

అడుగగా, ఇప్పుడు ఆఫీస్‌లో పనిఒత్తిడి ఉందని అప్పుడు, ఇప్పుడు అంటూ దాటవేస్తూ వచ్చాడు. తీరా కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సదరు మహిళలకు ఇళ్లను చూపించలేదు. మరికొంత మందికి నెంబర్లు ఇవ్వలేదు. నాగరాజు మోసం చేశాడని మహిళలు గుర్తించి తరుచూ నాగరాజుకు ఫోన్ చేయడం ప్రారంభించారు. ఆఫీసులో ఉన్నాను, మీటింగ్‌లో ఉన్నా, కలెక్టర్ కార్యాలయంలో ఉన్నాను ఇళ్లను ఇప్పిస్తానని చెబుతూ వచ్చాడు.

దివ్యాంగులు ఎక్కువ డబ్బులు ఇస్తే గ్రౌండ్ ఫ్లోర్‌లో కేటాయిస్తాం..

దివ్యాంగులు ఎక్కువ డబ్బులు ఇస్తే గ్రౌండ్ ఫ్లోర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్ల ఇప్పిస్తామని, పై అంతస్తులో అయితే ఇబ్బందులు పడతారని నమ్మించి కొంతమంది దగ్గర ఎక్కువ వసూలు చేశాడు.

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా తమకు నాగరాజు ఇళ్ల ఇవ్వడని మహిళలు తెలుసుకున్నారు. అనుమానం వచ్చి రోజూ అతడికి ఫోన్ చేసి తాము వస్తామని నిలదీయడం ప్రారంభించారు. అంజయ్యనగర్‌కు చెందిన మహిళలు స్థానికంగా ఉంటున్న సగర సంఘం అధ్యక్షుడు నర్సింహసాగర్‌ను కలిసి విషయం చెప్పారు. దీంతో అతను నాగరాజుతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడగా ఒక రోజు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఎంతకీ నాగరాజు డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీసులకు అప్పగిస్తామని చెప్పడంతో నాగరాజు సమీప బంధువైన భానుప్రసాద్ శ్రీవెంకటేశ్వర ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత నంటూ మధ్యవర్తిగా వ్యవహరించి, నాగరాజు ఇవ్వకపోతే తాను ఇస్తానని రెండు చెక్కులు ఇచ్చి నాగరాజును తీసుకెళ్లాడు. అందులో ఓ చెక్కు క్యాష్ చేసుకోగా మరో చెక్కు రూ. 5లక్షలు బౌన్స్ అయింది. దీంతో డబ్బులు ఇవ్వమని నాగరాజు, భానుప్రసాద్‌ను ఫోన్ ద్వారా సంప్రదిస్తే ఎటువంటి

ఇళ్లురావని తెలుసుకున్న మహిళలు..

సమాధానం లేదని సదరు మహిళలు వాపోయారు. అంజయ్యనగర్‌కు చెందిన నర్సింహసాగర్‌ను సంప్రదిస్తే ఏం చేస్తాం... తాను కల్పించుకోవడంతోనే మీకు కాస్త డబ్బులు వచ్చాయి. అతను దొంగ నేను ఏమీ చేయలేనని చేతులు ఎత్తేశాడు. దీంతో గత ఏడాది నవంబరు 13న సదరు మహిళలు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు నాగరాజుకు ఫోన్ చేస్తే మిమ్ములను ఎలా నమ్మాలని ప్రశ్నలతో పోలీసులకు సైతం చుక్కలు చూపించాడు. దీంతో పోలీసులు చేసేది లేక ఊరుకున్నారు. అప్పటి నుంచి నాగరాజు ఫోన్ స్విచ్చాఫ్ వస్తోంది. భానుప్రసాద్ సైతం అందుబాటులోకి రాకపోవడంతో తిరిగి డిసెంబర్ 26న మరోమారు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేస్తే తాము ఏమీ చేయలేం, నాగరాజు ఇళ్ల తెలుసు కదా ధర్నా చేయండని సలహా ఇచ్చి పంపించారని మహిళలు


నాగరాజుకు నగదు అందజేస్తున్న మహిళ

చెప్పారు. తాము ఇళ్లలో పనిచేస్తుంటామని, అప్పుచేసి డబ్బులు ఇచ్చామని చెప్పినా పోలీసులు కనికరించకపోవడం విడ్డూరం. అన్యాయం జరిగింది తమకు న్యాయం చేయాలని పోలీసులను సంప్రదించినా న్యాయం జరగలేదని మహిళలు వాపోతున్నారు. తమ బాధను గుర్తించి పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని, తమ డబ్బులు ఇప్పించాలని మహిళలు వేడుకుంటున్నారు. కాగా పోలీసులకు ఫిర్యాదు చేసే వరకు నాగరాజు ఫోన్‌లో అందుబాటులో ఉండేవాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా నాటి నుంచి ఫోన్ అందుబాటులో లేదని వస్తోందని మహిళలు తెలిపారు.



అసోసియేషన్ ప్రతినిధులతో కలిసి క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

వెల్ఫేర్ అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

హైదర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ పరిధిలోని వెంకటపాపయ్యనగర్ కాలనీ కమిటీ కార్యాలయంలో వెంకటపాపయ్యనగర్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025 క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ముఖ్యఅతిథిగా హాజరై క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్థానికంగా ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, రాందాస్‌గౌడ్, నరసింహులు, సత్యంరావు, మహీందర్‌రావు, నాగేశ్వరరావు జనార్దన్‌రావు, జీవన్‌రెడ్డి, వెంకటస్వామి గౌడ్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న మాజీ కార్పొరేటర్, కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామియాదవ్

ఘనంగా ముత్యాల ముగ్గుల పోటీలు

మియాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్, కొమిరిశెట్టి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సంక్రాంతి పండుగను పురస్కరించుకుని శేరిలింగంపల్లి ఎంఐజీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. విద్యార్థినిలు వేసిన ముగ్గులను న్యాయ నిర్ణేతలు టి.వరలక్ష్మి, అనూషా పరిశీలించి విజేతలను ఎంపిక చేశారు. వీరికి మాజీ కార్పొరేటర్, కొమిరిశెట్టి ఫౌండేషన్ అధ్యక్షుడు కొమిరిశెట్టి సాయిబాబా, ఫ్రెండ్స్‌వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ రామస్వామి యాదవ్ బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సంక్రాంతి అంటేనే ముగ్గుల పండుగని, కాంక్రీట్ జంగిల్‌గా మారిన నగరంలో నేటి యువత ముగ్గులను మరిచిపోకూడదనే ఈ పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో 50మంది విద్యార్థినిలు, హెడ్‌మాస్టర్ కవిత, అసోసియేషన్ సభ్యులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనులు పరిశీలిస్తున్న కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి

ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి పనులు: కార్పొరేటర్

రాయదుర్గం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): డివిజన్ పరిధిలో ప్రణాళికబద్ధంగా అభివృద్ధి పనులు చేస్తున్నామని కార్పొరేటర్ గంగాధర్‌రెడ్డి తెలిపారు. బుధవారం నానక్‌రాంగూడలో రూ.40లక్షలతో చేపడుతున్న సీసీరోడ్డు పనులను కాలనీవాసులు, జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యత ప్రమాణాలతో రోడ్డు పనులు గడువులోగా పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. స్థానికంగా ఎటువంటి సమస్యలు ఉన్న తన దృష్టికి తీసుకురావాలని, ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషిచేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ ఏఈ రషీద్, నాయకులు శివసింగ్, తిరుపతి, కిషన్‌గౌలి, సుమన్, శ్రీకాంత్‌రెడ్డి, బాబీసింగ్, రాజు, శ్రీను, వర్క్‌ఇన్‌స్పెక్టర్ భిక్షపతి, స్థానికులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఊద్గాలో ప్రార్థనలో పాల్గొన్న కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్

ఘనంగా ఉర్సు

గచ్చిబౌలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మతసామరస్యానికి ఉర్సు ఉత్సవాలు జరుపుకోవడం హర్షించతగ్గ విషయమని శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్‌యాదవ్ అన్నారు. బుధవారం సాయంత్రం డివిజన్ పరిధిలోని గోపినగర్, నెహ్రూనగర్‌లోని దర్గాలో ముస్లిం సోదరులతో కలిసి ఆయన ప్రత్యేక ప్రార్థనలు చేసి శుభాకాంక్షలు తెలిపారు. ప్రతియేట ఈ ఉత్సవంలో స్థానిక హిందు సోదరులు దర్గాలో చదర్ ఊరేగింపులో మైనార్టీ సోదరులతో కలిసి పాల్గొనడం ఆనవాయితీగా వస్తుందన్నారు. కార్యక్రమంలో గోపినగర్ బస్తీ నాయకులు యాదాగౌడ్, మాజీ కౌన్సిలర్ రాజేశ్వరమ్మ, బస్తీ అధ్యక్షుడు గోపాల్‌యాదవ్, రజాక్, ఖాజా, నవాజ్, సత్యనారాయణ, శైదులు తదితరులు పాల్గొన్నారు.

ఆల్ ఇండియా ఓబీసీ జాతీయ, రాష్ట్ర కమిటీలో

హెచ్‌సీయూ విద్యార్థుల నియామకం



ఆల్ ఇండియా ఓబీసీ జాతీయ రాష్ట్ర జాతీయ కమిటీలో నియామకమైన హెచ్‌సీయూ విద్యార్థులు

రాయదుర్గం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పరిశోధక విద్యార్థులు అఖిల భారత ఓబీసీ విద్యార్థుల సంఘం జాతీయ, రాష్ట్ర కమిటీల్లో కీలక పదవులు పొందినట్లు ఓ ప్రకటనలో తెలిపారు. రాజకీయశాస్త్ర విభాగంలో పీహెచ్‌డీ విద్యార్థి ఎస్.సాయికిరణ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా నియమితులయ్యారు. తెలుగు విభాగంలో పీహెచ్‌డీ విద్యార్థి లక్ష్మీనరసయ్య జాతీయ కార్యదర్శిగా, తెలుగు రాష్ట్రాల ఇన్‌చార్జిగా బాధ్యతలు స్వీకరించారు. డ్యాన్స్ విభాగంలో పీహెచ్‌డీ విద్యార్థి వరకాల వసుమతి యాదవ్ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు ఇన్‌చార్జిగా నియమితులయ్యారు. ఈ కొత్త కమిటీ సభ్యులు తెలంగాణలో కులగణన అనంతరం బీసీ రిజర్వేషన్లు పెంచే కార్యచరణ రూపొందించడం, స్కాలర్‌షిప్‌లు, ఫెలోషిప్‌లు వంటి సమస్యలు పరిష్కరించడంలో దృష్టి సారించనున్నట్లు పేర్కొన్నారు.

దుర్గంచెరువులో గుర్తుతెలియని మృతదేహం

హైదరాబాద్ సిటీ, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మాదాపూర్ దుర్గంచెరువులో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. బుధవారం ఉదయం దుర్గంచెరువు నీటిపై మృతదేహం తేలడంతో మాదాపూర్ పోలీసులకు లేక్ వ్యూ సిబ్బంది సమాచారం ఇచ్చారు. మృతి చెందిన వ్యక్తి 35-40 సంవత్సరాల వయస్సు ఉంటుందని, నలుపు రంగు టీ షర్ట్ ధరించాడని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించి, పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

‘డబుల్’ ఇళ్లు ఇప్పిస్తానని మోసం

- 22 మంది వద్ద డబ్బులు వసూలు చేసిన ఘరానా మోసగాడు
- ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు
- ఆందోళనలో బాధితులు

గచ్చిబౌలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తానని ఓ వ్యక్తి మోసం చేశాడు. ఓ మహిళల వద్ద డబ్బులు వసూలు చేసి ఇళ్లు ఇప్పించకుండా తప్పించుకు తిరుగుతూ పోలీసులకు సైతం చిక్కకుండా తిరుగుతున్న ఓ ఘరాన మోసగాడి ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈ ఘటన కొండాపూర్ డివిజన్ అంజయ్యనగర్‌లో జరిగింది. గచ్చిబౌలి టీఎన్‌జీవో కాలనీకి చెందిన నాగరాజు అనే వ్యక్తి 2022లో పాపిరెడ్డికాలనీకి చెందిన ఓ నిరుపేద మహిళకు తాను శేరిలింగంపల్లి తహసీల్దార్ కార్యాలయంలో పనిచేస్తానని, డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు తన చేతిలో ఉంటుందని, తనకు డబ్బులు ఇస్తే డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇప్పిస్తానని నమ్మించాడు. ఆ మహిళ తన బంధువులు, స్నేహితులు తెలిసిన వారు సుమారు 22 మందితో ఒక్కొక్కరు రూ.50 వేల చప్పున నాగరాజుకు ఇచ్చారు. వీరంతా ఇళ్లలో పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్న నిరుపేద మహిళలు.

అప్పులు తెచ్చి, పుస్తెల తాడు అమ్మి..

అప్పులు తెచ్చి, పుస్తెల తాడు సైతం అమ్మి నాగరాజుకు డబ్బులు ఇచ్చారు. పాపిరెడ్డికాలనీ, అంజయ్యనగర్, సిద్దిక్‌నగర్‌కు చెందిన పేదలు వీరంతా. కొంతమంది నగదు రూపంలో ఇవ్వగా మరికొందరు నాగరాజు ఫోన్‌నెంబర్ 8121800147 ఫోన్‌పే, జీపీఏ ద్వారా చెల్లించారు. గత సంవత్సరం జరిగిన ఎన్నికల ముందు అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్‌రూం ఇళ్ల కేటాయింపు చేశారు. ఆ సమయంలో కొంతమందికి ఇళ్లు వచ్చాయని, ఇంటినెంబర్లు సైతం మహిళలకు ఇచ్చాడు. నాగమణి అనే మహిళకు 339522, సన్నా అనే మహిళకు 339100, పద్మ 646699, రేణుకకు 268027, అనీతకు 285053, నాగుబాయి 28053, సూర్యకుమారి 650997 ఇంటినెంబర్ల గల ఇళ్లు మీకు లాటరీలో వచ్చాయని, త్వరలో మీకు అవి ఇస్తామని మహిళలను నమ్మించాడు. అప్పుడు కూడా లాటరీలో నెంబర్లు వచ్చాయి కదా మాకు ఇళ్లను చూపించాలని అడుగగా, ఇప్పుడు ఆఫీస్‌లో పనిఒత్తిడి ఉందని అప్పుడు, ఇప్పుడు అంటూ దాటవేస్తూ వచ్చాడు. తీరా కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా సదరు మహిళలకు ఇళ్లను చూపించలేదు. మరికొంత మందికి నెంబర్లు ఇవ్వలేదు. నాగరాజు మోసం చేశాడని మహిళలు గుర్తించి తరుచూ నాగరాజుకు ఫోన్ చేయడం ప్రారంభించారు. ఆఫీసులో ఉన్నాను, మీటింగ్‌లో ఉన్నా, కలెక్టర్ కార్యాలయంలో ఉన్నాను ఇళ్లను ఇప్పిస్తానని చెబుతూ వచ్చాడు.



పేదల సమక్షంలో పంచాయితీ నిర్వహించి చెక్కును అందజేస్తున్న దృశ్యం



నాగరాజు బంధువు భానుప్రసాద్

దివ్యాంగులు ఎక్కువ డబ్బులు ఇస్తే గ్రౌండ్ ఫ్లోర్‌లో కేటాయిస్తాం..

దివ్యాంగులు ఎక్కువ డబ్బులు ఇస్తే గ్రౌండ్ ఫ్లోర్‌లో డబుల్ బెడ్‌రూం ఇళ్లు ఇప్పిస్తామని, పై అంతస్తులో అయితే ఇబ్బందులు పడతారని నమ్మించి కొంతమంది దగ్గర ఎక్కువ వసూలు చేశాడు.

ఇళ్లురావని తెలుసుకున్న మహిళలు..

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది గడిచినా తమకు నాగరాజు ఇళ్లు ఇవ్వడని మహిళలు తెలుసుకున్నారు. అనుమానం వచ్చి రోజూ అతడికి ఫోన్ చేసి తాము వస్తామని నిలదీయడం ప్రారంభించారు. అంజయ్యనగర్‌కు చెందిన మహిళలు స్థానికంగా ఉంటున్న సగర సంఘం అధ్యక్షుడు నర్సింహసాగర్‌ను కలిసి విషయం చెప్పారు. దీంతో అతను నాగరాజుతో పలుమార్లు ఫోన్‌లో మాట్లాడగా ఒక రోజు పెద్దల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. ఎంతకీ నాగరాజు డబ్బులు ఇవ్వకపోవడంతో పోలీసులకు అప్పగిస్తామని చెప్పడంతో నాగరాజు సమీప బంధువైన భానుప్రసాద్ శ్రీవెంకటేశ్వర ఇన్‌ఫ్రా డెవలపర్స్ అధినేత నంటూ మధ్యవర్తిగా వ్యవహరించి, నాగరాజు ఇవ్వకపోతే తాను ఇస్తానని రెండు చెక్కులు ఇచ్చి నాగరాజును తీసుకెళ్లాడు. అందులో ఓ చెక్కు క్యాష్ చేసుకోగా మరో చెక్కు రూ. 5లక్షలు బౌన్స్ అయింది. దీంతో డబ్బులు ఇవ్వమని నాగరాజు, భానుప్రసాద్‌ను ఫోన్ ద్వారా సంప్రదిస్తే ఎటువంటి సమాధానం లేదని సదరు మహిళలు వాపోయారు. అంజయ్యనగర్‌కు చెందిన నర్సింహసాగర్‌ను సంప్రదిస్తే ఏం చేస్తాం.. తాను కల్పించుకోవడంతోనే మీకు కాస్త డబ్బులు వచ్చాయి. అతను దొంగ నేను ఏమీ చేయలేనని చేతులు ఎత్తేశాడు. దీంతో గత ఏడాది నవంబరు 13న సదరు మహిళలు గచ్చిబౌలి పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న పోలీసులు నాగరాజుకు ఫోన్ చేస్తే మిమ్ములను ఎలా నమ్మాలని ప్రశ్నలతో పోలీసులకు సైతం చుక్కలు చూపించాడు. దీంతో పోలీసులు చేసేది లేక ఊరుకున్నారు. అప్పటి నుంచి నాగరాజు ఫోన్ స్విచ్ఛాఫ్ వస్తోంది. భానుప్రసాద్ సైతం అందుబాటులోకి రాకపోవడంతో తిరిగి డిసెంబర్ 26న మరో మారు గచ్చిబౌలి పోలీసులకు ఫిర్యాదు చేస్తే తాము ఏమీ చేయలేం, నాగరాజు ఇళ్లు తెలుసు కదా ధర్నా చేయండని సలహా ఇచ్చి పంపించారని మహిళలు చెప్పారు. తాము ఇళ్లలో పనిచేస్తుంటామని, అప్పుచేసి డబ్బులు ఇచ్చామని చెప్పినా పోలీసులు కనికరించక పోవడం విడ్డూరం. అన్యాయం జరిగింది తమకు న్యాయం చేయాలని పోలీసులను సంప్రదించినా న్యాయం జరగలేదని మహిళలు వాపోతున్నారు. తమ బాధను గుర్తించి పోలీసు ఉన్నతాధికారులు న్యాయం చేయాలని, తమ డబ్బులు ఇప్పించాలని మహిళలు వేడుకుంటున్నారు. కాగా పోలీసులకు ఫిర్యాదు చేసే వరకు నాగరాజు ఫోన్‌లో అందుబాటులో ఉండేవాడని, పోలీసులకు ఫిర్యాదు చేసినా నాటి నుంచి ఫోన్ అందుబాటులో లేదని వస్తోందని మహిళలు తెలిపారు.



నాగరాజుకు నగదు అందజేస్తున్న మహిళ

ఓటరు లిస్టుపై రాజకీయ పార్టీలతో సమీక్ష సమావేశం

గచ్చిబౌలి, జనవరి 8(ఆంధ్రజ్యోతి): కొత్త ఓటరు లిస్టుపై అనుమానాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని శేరిలింగంపల్లి నియోజకవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీలకు శేరిలింగంపల్లి డిప్యూటీ కమిషనర్ ముకుందారెడ్డి తెలిపారు. బుధవారం తన చాంబర్‌లో నియోజవర్గానికి చెందిన అన్ని రాజకీయ పార్టీల నాయకులతో కొత్త ఓటరు లిస్టుపై సమీక్ష నిర్వహించారు. కొత్తగా ఓటరు లిస్టును విడుదల చేశామని, 34వేలమంది ఓటర్లు తమపేర్లు నమోదు చేసుకున్నారని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని తెలిపారు. మృతిచెందిన వారి ఓట్లు తొలగించడం లేదని, అలాగే చాలామంది డబుల్ ఓట్లు ఉన్నవారు ఉన్నారన్నారు. డబుల్ ఓట్లను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని ఎంఐఎం నాయకుడు నజీర్, సీపీఐ నాయకుడు కృష్ణ అధికారులను ప్రశ్నించగా వివరాలు ఉంటే ఇవ్వాలని డీసీ తెలిపారు. డబుల్ ఓట్లు ఉన్న వారి వివరాలు మాదృష్టికి తీసుకువస్తే దర్యాప్తు చేసి తొలగిస్తామన్నారు. కొత్త ఓటరు లిస్టును అన్ని రాజకీయ పార్టీలకు ఇవ్వడం జరిగిందన్నారు. మరిన్ని వివరాల కోసం సర్కిల్ కార్యాలయంలో సంప్రదించవచ్చని తెలిపారు. మృతిచెందిన వారి ఓట్లు సుమారు 2వేల వరకు తొలగించామని, ఇంకా ఎవరైన ఉంటే సమాచారం ఇవ్వాలని నాయకులకు సూచించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మున్సిపల్ కమిషనర్లు, కాంగ్రెస్, బీఆర్‌ఎస్, ఎంఐఎం, సీపీఐ నాయకులు పాల్గొన్నారు.



రాజకీయ నాయకులతో మాట్లాడుతున్న డిప్యూటీ కమిషనర్ ముకుందారెడ్డి

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

రాయదుర్గం, జనవరి 8(ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలి సబ్‌స్టేషన్ పరిధిలోని పలు విద్యుత్ ఫీడర్ల పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి 1 గంట వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ఏపీహెచ్‌బీకాలనీ, జయభేరి ఎన్‌క్లేవ్, ఓల్డ్‌గచ్చిబౌలి, హిల్‌రిడ్జ్ విల్లాస్, టిమ్స్ హాస్పిటల్, గోపిచంద్ స్టేడియం, జీపీఆర్‌ఏ క్వార్టర్స్, యాకో బ్యాంక్, గ్రీన్‌ల్యాండ్ కాలనీ, జేవీ కాలనీ, ఇంటర్నేషనల్, ట్రిపుల్‌ఐటీ, హాకీ స్టేడియం, బ్రహ్మకుమారీస్, కేంద్రీయ విహార్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

- మధ్యాహ్నం 2నుంచి సాయంత్రం 5గంటల వరకు టీజీఐఐసీ, వైఎస్ఆర్ భవన్, జర్నలిస్టు కాలనీ, ఫైర్‌స్టేషన్, గౌలిదొడ్డిగ్రామం, అపర్ణ, కేశవనగర్, జయభేరి ఫేజ్-4, జయభేరి మెడోస్, జయభేరి ఆరెంజ్‌కౌంటి, ఐఐఆర్ఎం, డీడీఎల్, సీఏ, బ్రిడ్జి, వెస్ట్‌టెండ్ క్యాపిటల్, లెమన్‌ట్రీ హోటల్, మైహోం క్రిష్, రాయల్‌ఆర్చ్‌డ్, టీఎన్‌జీఓ కాలనీ, రంగారెడ్డి, ఢిల్లీ, ఓల్డ్‌గచ్చిబౌలి, కేంబ్రిడ్జిస్కూల్, ట్రెండ్‌సెట్, రాజ్‌పుష్ప, నానక్‌రాంగూడ, హనుమాన్ టెంపుల్, ఎస్సీ బస్తీ, పద్మశ్రీ గార్డెన్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

హైదర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ విద్యుత్ ఫీడర్ పరిధిలో మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సాయినగర్ ఈస్ట్, వెస్ట్, ఆల్విన్‌కాలనీ ఫేజ్-2, సాయిదత్త స్కూల్, ఆల్విన్‌కాలనీ మెయిన్‌రోడ్‌లో విద్యుత్ ఉండదన్నారు.

నాలాల విస్తరణే ముంపు సమస్యకు పరిష్కారం

గచ్చిబౌలి, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కొండాపూర్ గఫూర్‌నగర్ నుంచి దుర్గంచెరువు వరకు, సైబర్‌హిల్స్ నుంచి జనార్దన్‌హిల్స్ వరకు నూతనంగా చేపడుతున్న నాలా విస్తరణ పనులను అధికారులతో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ బుధవారం పరిశీలించారు. ఈ ప్రాంత కాలనీ వాసులతో నాలాను పరిశీలించారు. అనంతరం జనార్దన్‌హిల్స్‌లో స్థానికులతో సమావేశం నిర్వహించారు. సుమారు రూ.25కోట్లతో నాలాలను విస్తరించనున్నామని, పనులు పూర్తయితే ఈ ప్రాంతంలో ముంపు సమస్య ఉండదని గాంధీ అన్నారు. త్వరలో పనులు ప్రారంభిస్తామని ఆయన వివరించారు. పనులు జరిగే సమయంలో స్థానికులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకుంటామన్నారు. వర్షాకాలంలో వరదనీటితో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని త్వరలోనే ఆ సమస్య పరిష్కారమవుతుందని ఆయన అన్నారు. వర్షాకాలం లోపు పనులు పూర్తిచేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్ఎన్‌డీపీ అధికారులు ఈఈ సత్యనారాయణ, డీఈ వసిదర్‌తో పాటు నాయకులు శ్రీనివాస్‌యాదవ్, కాలనీల వాసులు పాల్గొన్నారు.



విస్తరించనున్న నాలాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



పార్కును పరిశీలించి అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్

మల్టీ జనరేషన్ పార్కును తీర్చిదిద్దుతాం

మియాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మియాపూర్ మయూరినగర్‌లోని మల్టీ జనరేషన్ పార్క్‌లో చేపట్టిన సుందరీకరణ పనులను బుధవారం జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి మియాపూర్ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్క్‌ను అన్ని రకాలుగా సుందరీకరించి అన్ని హంగులతో సకల సౌకర్యాలతో తీర్చిదిద్దుతామన్నారు. చిన్నపిల్లల నుంచి వృద్ధుల వరకు పార్కుకు వచ్చి సేద తీరేలా తీర్చిదిద్దడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు ఈఈ కేవీఎస్ రాజు, డీఈ దుర్గాప్రసాద్, ఏఈ సంతోష్‌కుమార్ పాల్గొన్నారు.

గ్రామీణాభివృద్ధికి ఆచరణాత్మక నైపుణ్యాలే ఆధారం

- పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా

రాయదుర్గం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గ్రామీణాభివృద్ధి భవిష్యత్ అధికార విద్యపైనే కాకుండా వివిధ రంగాల్లో ఉపాధి పొందగల ఆచరణాత్మక నైపుణ్యాలపై కూడా ఆధారపడి ఉంటుందని భారత్ బయోటెక్ సంస్థ చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా అన్నారు. గచ్చిబౌలిలోని యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ స్కూల్ ఆఫ్ లైఫ్ సైన్సెస్ ఆడిటోరియంలో ఉన్నత్ భారత్ అభియాన్ రెండురోజుల జాతీయ వర్క్‌షాపు ఐఓఈ హెచ్‌సీయూ ఆధ్వర్యంలో బుధవారం ప్రారంభమైంది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హెచ్‌సీయూ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు, అతిథిగా కృష్ణ ఎల్లా పాల్గొని వర్క్‌షాపు ప్రారంభ కార్యక్రమంలో ఆయన ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకడమిక్ డిగ్రీల కంటే నైపుణ్యం ప్రాముఖ్యతను ఆయన నొక్కి చెప్పారు. దేశంలో యువత ఉద్యోగ ఉపాధి అవకాశాలు మెరుగుపడాలంటే వృత్తినైపుణ్యతపై దృష్టి సారించాలన్నారు. నైపుణ్యత ఉన్న యువకులు ఎక్కడికో వెళ్లి ఉద్యోగాలు చేయాల్సిన అవసరం లేదని, గ్రామాల్లోనే ఉపాధి పొందేందుకు వృత్తి నైపుణ్యత ఉపయోగపడుతుందన్నారు. ప్రొఫెసర్ బీజేరావు మాట్లాడుతూ ఉన్నత్ భారత్ అభియాన్ ముఖ్య ఉద్దేశ్యం పట్టణాల్లో ఉద్యోగ ఉపాధి పొందుతున్న యువత కన్నా గ్రామీణ ప్రాంతాల్లోని యువతకు వృత్తినైపుణ్యం పెంచుకునేందుకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయన్నారు. ఉన్నత భారత్ అభియాన్ కార్యాలయం ద్వారా ఒకప్పుడు గ్రామీణ ప్రాంతాల నుంచి ఉపాధి కోసం యువత పట్టణాలకు వచ్చే పరిస్థితి నుంచి నేడు యువత పట్టణాల్లో స్కిల్స్ పెంపొందించుకుని గ్రామీణ ప్రాంతాలకు తిరిగి వెళ్లే అవకాశాలు కల్పిస్తుందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అన్ని రంగాల వారికి ఉపాధి అవకాశాలు స్వయంగా పెంపొందించుకునేందుకు వనరులు అధికంగా ఉంటాయన్నారు. అయితే వారందరిని మరింత మెరుగైన స్థితికి తీసుకువెళ్లే ప్రక్రియ ఉన్నత్ భారత్ అభియాన్ కార్యక్రమం ద్వారా ప్రజల్లోకి తీసుకువెళ్లేందుకు వీలు కలుగుతుందన్నారు. మొదటి రోజు కార్యక్రమంలో కోఆర్డినేటర్ ఉన్నత భారత్ అభియాన్ డాక్టర్ రావాల కృష్ణయ్య, డైరెక్టర్ ఎస్ఎస్ఈ డాక్టర్ శ్రీకాంత్‌శర్మతో పాటు పలువురు ప్రతినిధులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న భారత్ బయోటెక్ సంస్థ చైర్మన్ పద్మభూషణ్ డాక్టర్ కృష్ణ ఎల్లా

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

హైదర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదర్‌నగర్ డివిజన్ శ్రీరామ్‌నగర్, హెచ్‌ఎంటీ హిల్స్, సమతనగర్ కాలనీలో రూ.61.50లక్షలతో చేపట్టబోయే సీసీ రోడ్డు పనులకు కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావుతో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ ప్రజల సంక్షేమం, నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకెళ్తున్నామని తెలిపారు. ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నామన్నారు. రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు, విద్యుత్ దీపాలు వంటి సౌకర్యాలు కల్పిస్తున్నామని పేర్కొన్నారు. నాణ్యత ప్రమాణాలతో రోడ్డు పనులు చేయాలని, అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని ఆదేశించారు. నాణ్యత విషయంలో రాజీపడే ప్రసక్తి లేదని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో కాలనీల అసోసియేషన్ ప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



సీసీరోడ్డు పనుల శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ నార్నె శ్రీనివాసరావు

నేడు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

మియాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మియాపూర్, చందానగర్ డివిజన్‌లో గురువారం రూ2కోట్లతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు స్థానిక కార్పొరేటర్లతో కలిసి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ శంకుస్థాపనలు చేయనున్నారు.


సదస్సు ప్రారంభోత్సవంలో పాల్గొన్న పలు దేశాలకు చెందిన వక్తలు

అంతర్జాతీయ సదస్సు ప్రారంభం

దుండిగల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): బాచుపల్లిలోని వీఎన్‌ఆర్ వీజేఐఈటీలో ఇంజనీరింగ్ విద్యపై మూడు రోజుల పాటు జరగనున్న అంతర్జాతీయ సదస్సు బుధవారం ప్రారంభమైంది. వీఎన్‌ఆర్‌వీజేఐఈటీతో సహా ఇండో యూనివర్స్ కొలబారేషన్ ఫర్ ఇంజనీరింగ్ ఎడ్యుకేషన్ సంస్థ సహకారంతో ఈ సదస్సు నిర్వహిస్తున్నారు. 12వ సంపుటిలో గౌరవ అతిథిగా ఏబీఈటీయూఎస్ఏ సీఈఓ డాక్టర్ మైకేల్ మిలిగన్, ఐయూసీఈఈఈ వ్యవస్థాపకులు, కార్యనిర్వాహక సంచాలకులు ఆచార్య డాక్టర్ కృష్ణ వేదులతో సహా యూఎస్ఏ, ఆస్ట్రేలియా, ఆస్ట్రియా ఫిన్‌లాండ్, పోర్చుగల్ దేశాలు, భారతదేశంలో పలు రాష్ట్రాల నుంచి విద్యావేత్తలు, పరిశ్రమలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు. సదస్సు ప్రారంభోత్సవంలో వక్తలు మాట్లాడుతూ కృత్రిమ మేధా వల్ల కలిగే ప్రయోజనాలు, అనుకూల, ప్రతికూల ప్రయోజనాలు నేటితరం విద్యార్థులకు అనుకూలమైన విద్యా బోధన సరళి వంటి పలు విషయాలను ప్రస్తావించారు. ఈ సదస్సు ప్రారంభోత్సవంలో కళాశాల డీన్ ఆచార్య వై.పద్మసాయి, సంచాలకులు చెన్న కేశవరావు, సంచాలకులు సీడీ నాయుడు, విజేఐఎం సంచాలకు భరత్‌భూషన్‌సింగ్, విజ్ఞాన జ్యోతి సంస్థల సంచాలకులు కోడే సంధ్య, డాక్టర్ డీఎస్ రావు, దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి 30 సంస్థలకు పైగా విద్యా సంస్థలకు చెందిన పలువురు అధ్యాపకులు, వివిధ దేశాలకు చెందిన పలు పరిశ్రమలకు చెందిన నిపుణులు పాల్గొన్నారు.

అధికారులపై చర్యలు తీసుకోవాలి

దుండిగల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): నిజాంపేట్ కార్పొరేషన్ బాచుపల్లి గ్రామంలో బందంకుంట చెరువులో అక్రమ అనుమతులకు అవకాశం ఇచ్చిన అధికారులపై హెచ్‌ఎండీఏ, ఇరిగేషన్ మున్సిపల్ అధికారులు పూర్తి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని నిజాంపేట్ కార్పొరేషన్ మేనేజర్‌కు పూర్తి ఆధారాలతో బుధవారం బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. బాచుపల్లిలో బందంకుంటచెరువు సర్వే నంబరు 253/బీలో విజన్ కన్‌స్ట్రక్షన్ ఇరిగేషన్ ఎన్‌ఓసీ అనుమతులులేకుండా చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్‌లో భారీ భవన నిర్మాణాలు కొనసాగిస్తున్నాయని వారు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. దీనికి గత మున్సిపల్ కమిషనర్ రామకృష్ణ, టౌన్ ప్లానింగ్ ఏసీపీ శ్రీనివాస్, టీపీఓ ప్రశాంతి కలిసి ఆ సర్వే నంబరులో చెరువు లేదని తప్పుడు సైట్ విజిట్ రిపోర్టు ఇచ్చారన్నారు. దానిని ఆసరగా చేసుకున్న నిర్మాణదారులు జీ+5 అంతస్తుల నిర్మాణానికి అనుమతులు తీసుకొని, నిర్మాణాలు కొనసాగిస్తున్నారని, ఈ విషయంపై తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ వినతి పత్రం ఇచ్చిన వారిలో బీజేపీ నాయకులు ఆకుల సతీష్, అమలేశ్వరి, కవితారెడ్డి, అరుణ్‌రావు, సుధాకర్‌రెడ్డి, కుమార్ గౌడ్, పాండు ఉన్నారు.

ప్రభుత్వ భూమిలో సర్వే నిర్వహించిన రెవెన్యూ అధికారులు

పేట్‌బషీరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): వివాదస్పద ప్రభుత్వ భూమిలో రెవెన్యూ అధికారులు సర్వే చేపట్టారు. జాతీయ రహదారి 44 సర్వీస్ రోడ్డుకు ఆనుకొని ఉన్న జీడిమెట్ల గ్రామం సర్వే నంబరు 48లో సుమారు 4856 గజాల స్థలంలో అర్బన్ సీలింగ్ ల్యాండ్ ఉంది. గత కొన్ని సంవత్సరాలుగా ఈ స్థలంలో నర్సరీ గార్డెన్ కొనసాగుతోంది. ఇటీవల గార్డెన్‌ను కూల్చి వేసి, బహుళ అంతస్తుల నిర్మాణాన్ని చేపట్టేందుకు రంగం సిద్ధమైంది. జీడిమెట్ల గ్రామానికి చెందిన కొందరు సర్వే నంబరు 48లో అర్బన్ సీలింగ్ ల్యాండ్ ఉందని రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందుకున్న అధికారులు బుధవారం సర్వే నెంబరు 48లో కుత్బుల్లాపూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ స్వామి, మేడ్చల్ జిల్లా యూఎల్‌సీడీఐ బాలరాజు, ఆర్ఐ విజయ్ కుమార్‌లు సర్వే నిర్వహించారు.


సర్వే చేస్తున్న అధికారులు

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

జీడిమెట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు వాహనదారులు తప్పని సరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని జీడిమెట్ల ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు అన్నారు. రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుధవారం జీడిమెట్ల ఆర్టీసీ డిపోలో నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ప్రజలు తమవంతు కృషిచేయాలని సూచించారు. మనపైన కుటుంబ సభ్యులు ఆధారపడి ఉంటారన్న విషయాన్ని ప్రతి డ్రైవర్ గుర్తుంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో మేనేజర్ కే.ఆంజనేయులు, ఎస్.నీలవేణి, సందీప్, కండక్టర్లు, డ్రైవర్లు పాల్గొన్నారు.


ట్రాఫిక్ సీఐని సన్మానిస్తున్న డిపో అధికారులు


బాచుపల్లి మండల కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు

కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలి

దుండిగల్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు, ఇళ్ల స్థలాలను కేటాయించాలి. అలాగే కనీసం వేతనం రూ. 26 వేలు ప్రభుత్వం అమలు చేయాలని సీఐటీయూ నాయకులు నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లోని బాచుపల్లి మండల కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా నాయకులు చంద్రశేఖర్, యూనియన్ నాయకులు నర్సింహ, ఎల్లమ్మలు మాట్లాడుతూ అర్హులైన కార్మికులందరికీ గత ప్రభుత్వం మొదట ప్రాధాన్యతగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేటాయిస్తామని హామీ ఇచ్చి, కేటాయించకుండా కార్మికులకు అన్యాయం చేసిందన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కనీసం వేతనాన్ని పెంచాలన్నారు. ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు ఇందిరమ్మ ఇళ్లు కేటాయించాలన్నారు. కార్మికులకు పారిశుధ్యానికి అవసరమైన పనిముట్లను అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీను, లక్ష్మి, వెంకటి, లక్ష్మి, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

కట్టమైసమ్మ చెరువు కాలుష్య కాసారం


కబ్జాకు గురైన కట్టమైసమ్మ లింగం చెరువు

- దుర్గంధం వెదజల్లుతున్న బతుకమ్మకుంట
- పట్టించుకోని అధికారులు
- ఆక్రమణలతో కుచించుకుపోతున్న చెరువు

షాపూర్‌నగర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, సూరారం ప్రధాన రహదారి పక్కనే ఉన్న కట్టమైసమ్మ చెరువు చెత్తతో నిండిపోయి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ చెరువుకి మరోపక్కన కట్టమైసమ్మ, రేణుకా ఎల్లమ్మదేవి దేవాలయాలు ఉన్నాయి. ఈ దుర్గంధం వల్ల గుడికి వచ్చే భక్తులు పూజలు చేసుకొనేందుకు వీలులేకుండా పోతుందని భక్తులు అధికారులపై మండిపడుతున్నారు. గత వినాయకచవితికి చెరువులో విగ్రహాలను నిమజ్జనం చేయగా, చెరువులో చెత్త పేరుకుపోయింది. ఈ చెత్త కుళ్ళిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు చెరువు పరిశుభ్రతను పెడచెవిన పెట్టడంతో ప్రజలు కాలుష్య కాసారం మధ్య కొట్టుమిట్టాడుతున్నారు. చెరువుకు ఒక పక్కన బతుకమ్మ కుంటను నిర్మించిన అధికారులు కుంట చూడడానికి అందంగా కనిపిస్తున్నా, కుంట చెత్తతో నిండిపోయి నీరు కూడా కనిపించని విధంగా మారింది.

త్వరలో కట్టమైసమ్మ జాతర జరుగనున్నందున ఇప్పటికైనా చెరువు ప్రక్షాళన పనులు చేపట్టాలని గుడి కమిటీ, భక్తులు కోరుతున్నారు. ఆహ్లాదకరమైన వాతావరణం, పవిత్రంగా అమ్మవారిని పూజించే విధంగా చెరువును ప్రక్షాళన చేయాలంటున్నారు. చెరువులో పేరుకుపోయిన చెత్తను తొలగించి, పక్కనే ఉన్న బతుకమ్మకుంటను కూడా శుభ్రం చేయించాలి.

కుంటను ప్రక్షాళన చేయాలి

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు బతుకమ్మ చిహ్నం. గత ప్రభుత్వం ఇబ్బడి ముబ్బడిగా బతుకమ్మకుంటలను నిర్మించారు. పండుగ రోజు బతుకమ్మలను కుంటలో వదిలేలా అనువుగా ఉండాల్సిన బతుకమ్మకుంట నేడు చెత్తతో నిండిపోయింది. కుంట నుంచి దుర్వాసన రావడంతో ఆ పరిసరాలకు వెళ్ళలేని దుస్థితి నెలకొంది. తక్షణమే కుంటను ప్రక్షాళన చేయాలని పలువురు కోరుతున్నారు.


చెత్తతో నిండిపోయిన బతుకమ్మకుంట


చెరువులో పేరుకుపోయిన చెత్తాచెదారం

చెరువు ఎఫ్‌టీఎల్ మాయం

చెరువు పరిసరాల్లో ఆక్రమణలు జరగడంతో ఇప్పటికే చెరువు సగం కుంచించుకుపోయింది. చెరువు ఎఫ్‌టీఎల్‌లో పెద్ద పెద్ద బహుళ అంతస్తుల భవనాలు వెలిశాయి. చెరువును ఆక్రమించి నిర్మాణాలు చేపడుతున్నా ఏ ఒక్కరు పట్టించుకోపోవడంతో కబ్జాదారులు ఇష్టారాజ్యంగా ఆక్రమణలకు పాల్పడుతున్నారు. పెద్దల సహాయ సహకారాలతోనే ఈ తతంగం జరుగుతుందనేది బహిరంగానే విమర్శలు ఉన్నాయి. చెరువులను ప్రక్షాళన చేస్తున్న ప్రభుత్వం ఈ చెరు ఎఫ్‌టీఎల్‌లో జరుగుతున్న కబ్జాలను ఎందుకు పట్టించుకోవడం లేదని పలువురు ప్రశ్నిస్తున్నారు. చెరువుల ప్రక్షాళనలో భాగంగా కట్టమైసమ్మ చెరువును సుందరీకరించాలని ప్రజలు కోరుతున్నారు.

సుందరీకరించాలి



నగరంలోని అన్ని చెరువులను ప్రక్షాళన చేసి కబ్జాలకు గురైన చెరువులకు తిరిగి పూర్వవైభవం వచ్చేలా చూడాలి. గతంలో ఈ చెరువు పంట పొలాలకు, తాగునీటికి ఉపయోగపడేదని, ప్రస్తుతం కాలుష్య కాసారంగా మారింది. ఫిబ్రవరిలో అమ్మవారి జాతర జరుగుతున్నందున తక్షణమే చెరువును సుందరీకరించాలి.

- శ్రీనివాస్‌రెడ్డి, గుడి కమిటీ సభ్యుడు

దర్జాగా భూ కబ్జాలు

- పట్టించుకోని రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు
- మార్కెట్ స్థలాన్ని కబ్జాచేసి నిర్మాణాలు సాగిస్తున్న బీఆర్‌ఎస్ నాయకుడు


వేంకటేశ్వరస్వామి ఆలయం సమీపంలో దర్జాగా సాగుతున్న కబ్జా

జీడిమెట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ మండలం జగద్గిరిగుట్ట ప్రాంతం కబ్జాదారులకు అడ్డాగా మారింది. ఇక్కడ గత కొన్ని సంవత్సరాలుగా అడ్డుఅదుపు లేకుండా ప్రభుత్వ భూములు కబ్జాలకు గురవుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోవడం లేదు. తూతూ మంత్రంగా కూల్చివేతలు సాగిస్తూ, భూకబ్జాదారులతో మిలాఖత్ అవుతున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యక్తులు ఎక్కడ ప్రభుత్వ భూమి కనిపిస్తే అక్కడ పాగా వేసి, రాత్రికి రాత్రే నిర్మాణాలు సాగిస్తూ కోట్ల రూపాయలకు విక్రయిస్తున్నారు. ప్రభుత్వాలు మారినా భూకబ్జాలు మాత్రం యధావిధిగా కొనసాగుతున్నాయి. ప్రధానంగా సర్వే నంబర్ 348/1లోని వందల ఎకరాల ప్రభుత్వ భూమి నేడు పదుల సంఖ్యలోకి వచ్చిందంటే ఏ స్థాయిలో కబ్జాలు సాగించారనేది తెలుస్తుంది. శ్రీలక్ష్మీవేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలో కుల సంఘాలు, దేవాలయాల ముసుగులో కొందరు ఇష్టానుసారంగా కబ్జాలు సాగించారు. అదేవిధంగా మరికొందరు అనాథ ఆశ్రమాల పేరుతో కబ్జాలు చేసి ప్లాట్లు చేసి విక్రయిస్తున్నారు. రాజీవ్ గృహకల్ప సమీపంలో మార్కెట్ నిర్మాణానికి వదిలిన స్థలాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకుడు, ప్రముఖ భూకబ్జాదారుడు కబ్జాచేసి తప్పుడు పత్రాలతో నిర్మాణాలు సాగిస్తున్నారు. ఈ భూమిని కాపాడాలని బీజేపీ నాయకులు సర్కిల్ కమిషనర్, తహసీల్దార్‌కు వినతిపత్రాలు ఇచ్చినా అధికారుల్లో ఎలాంటి స్పందన లేకపోవడం విచారకరం. జగద్గిరిగుట్ట పోలీస్‌స్టేషన్ సమీపంలో పెద్దబండరాళ్లు పగులకొట్టి నిర్మాణాలు చేపడుతున్నా, భూదేవిహిల్స్‌లో దర్జాగా పరికి చెరువును కబ్జాచేసి నిర్మాణాలు సాగిస్తున్నా రెవెన్యూ యంత్రాంగం కళ్లుమూసుకుంది. కూన మహాలక్ష్మినగర్, రాజీవ్‌గృహకల్ప ప్రాంతంలో పార్కు స్థలాలను కబ్జాచేస్తున్నా చర్యలు తీసుకోవడం లేదు. రాజీవ్ గృహకల్పలో కొందరు బీఆర్ఎస్ నాయకుల అండదండలతో అదనపు గదుల ముసుగులో లక్షల రూపాయాలు వసూలు చేస్తున్నారు. ప్రభుత్వ భూములు కబ్జా అవుతున్నా అధికారులు ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనేది ప్రశ్నార్థకం. ఇప్పటికైనా రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ అధికారులు జగద్గిరిగుట్ట ప్రాంతంలో కబ్జాకు గురవుతున్నా ప్రభుత్వ భూములను కాపాడాలని స్థానికులు కోరుతున్నారు.

చర్యలు తీసుకుంటాం

జగద్గిరిగుట్ట ప్రాంతంలో జరుగుతున్న భూకబ్జాలపై ఇప్పటికే అనేక సార్లు చర్యలు తీసుకున్నాం. ఎప్పటికప్పుడు మా సిబ్బంది అక్కడ జరుగుతున్న భూకబ్జాలపై కన్నుపెట్టి కూల్చివేతలు చేపడుతున్నారు. భూకబ్జాలకు పాల్పడే వారు ఎంతటి వారైనా ఉపేక్షించే పనిలేదు. తప్పని సరిగా చర్యలు తీసుకుంటాం.

- రెహమాన్, తహసీల్దార్, కుత్బుల్లాపూర్ మండలం


వైద్య పరీక్షలు చేయించుకొంటున్న మల్లారెడ్డి

వాతావరణంలో మార్పులకు అనుగుణంగా వైద్యపరీక్షలు చేయించుకోవాలి

పేట్‌బషీరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): బస్తీల్లో నిర్వహిస్తున్న వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మేడ్చల్ జిల్లా బీజేపీ అధ్యక్షులు డాక్టర్ ఎస్.మల్లారెడ్డి అన్నారు. డివిజన్‌లోని రంగారెడ్డినగర్‌లో ఏర్పాటుచేసిన ఉచిత వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా వాతావరణంలో మార్పుకు అనుగుణంగా వస్తున్న వ్యాధులు సోకకుండా ఈ శిబిరాలను ప్రజలు వినియోగించుకొని, పరీక్షలు చేయించుకొని మందులు తీసుకెళ్ళాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఓబీసీ మోర్చ ప్రధాన కార్యదర్శి నందనం దివాకర్, శ్రీనివాస్‌గౌడ్, కేశవ్‌యాదవ్, మణికంఠలు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజులరామారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): గాజులరామారం విద్యుత్ సబ్-స్టేషన్ పరిధిలోని విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా ఉదయం పది గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ ఒక ప్రకటనలో తెలిపారు. గాజులరామారం విలేజ్, బాలాజీ లే-అవుట్ ఉషోదయా కాలనీ ఫేజ్-1, 2, ఇందిరానగర్, రోడామేస్త్రీనగర్, జహంగీర్‌బస్తీ, వివేకానంద్‌నగర్, శ్రీనివాసనగర్, ఎస్బీటీ నగర్, శ్రీరామ్‌నగర్-ఏ, బీ, బేకరిగడ్డ, హాజ్ అలీ మసీద్ రోడ్డు, వల్లభాయ్ పటేల్‌నగర్, భవానినగర్, పీపీనగర్, మల్లారెడ్డి నగర్, జయశంకర్‌నగర్, చిత్తారమ్మదేవి నగర్, గాజులరామారం చౌరస్తా, శ్రీవెన్ ఎన్‌క్లేవ్, తత్వా స్కూల్ లైన్, ఓక్షిత ఎన్‌క్లేవ్, వీనస్ ఎన్‌క్లేవ్, కృష్ణ మహాలక్ష్మినగర్, మోడీ బిల్డర్స్, మెట్కాన్‌గూడ, వెంకటేశ్వర గార్డెన్ వెనుక, సీఎంఆర్ స్కూల్ సమీపంలో, స్పెండర్ అపార్టుమెంట్స్‌లో విద్యుత్‌ను నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు.

చైనా మాంజాలు అమ్మితే చర్యలు : సీఐ


సీఐ భరత్‌కుమార్

గాజులరామారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి పండుగ సందర్భంగా ప్రభుత్వం నిషేదించిన చైనా మాంజాలు విక్రయిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకొని, కేసు నమోదు చేస్తామని సూరారం పోలీస్ స్టేషన్ సీఐ భరత్‌కుమార్ తెలిపారు. గతంలో చైనా మాంజాలు వల్ల ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలు బారిన పడిన సందర్భాలున్నాయని, ప్రజల ప్రాణాలకు హాని కలిగించే చైనా మాంజాల వినియోగాన్ని నిషేధించాలని, ఎవరైనా విక్రయిస్తున్నట్టు తెలిస్తే సూరారం పోలీసులకు గానీ, 100 డయల్‌కు గాని ఫిర్యాదు చేయాలని తెలిపారు.

ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవం ఎప్పుడు?



జీడిమెట్ల, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుత్బుల్లాపూర్ సర్కిల్ సుభాష్‌నగర్ డివిజన్ ఎస్ఆర్‌నాయక్‌నగర్‌లో కోటి రూపాయాలతో నిర్మించిన ఇండోర్ స్టేడియం ప్రారంభోత్సవానికి నోచుకోవడం లేదు. అధికారుల నిర్లక్ష్యంతో ఇది ఆగిపోయిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. స్టేడియం పనులు పూర్తయినా స్టేడియం ఎప్పుడు ప్రారంభమవుతుందని ఎస్ఆర్‌నాయక్‌నగర్, అపురూపాకాలనీ వాసులు వేయికళ్లతో ఎదురుచూస్తున్నారు. వెంటనే ప్రారంభోత్సవం చేసి అందుబాటులోకి తీసుకురావాలని కాలనీవాసులు కోరుతున్నారు.

హెచ్‌సీయూ ప్రొఫెసర్ రాజగోపాల్‌కు.. ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలో అవార్డు



హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలోని స్కూల్ ఆఫ్ ప్లాంట్ సైన్స్ ప్రొఫెసర్ రాజగోపాల్ ఇండియన్ అకాడమీ ఆఫ్ సైన్సెస్-2025 ఫెలోగా ఎన్నికయ్యారు. కిరణజన్య సంయోగక్రియ రంగంలో ఆయన చేసిన కృషికి గుర్తింపుగా ఈ అవార్డు లభించింది. మెరుగైన కిరణజన్య సంయోగక్రియ సామర్థ్యం, పర్యావరణ సవాళ్లకు ఎక్కువ స్థితిస్థాపకతతో మొక్కల అభివృద్ధికి ఆయన పరిశోధన మార్గాన్ని చూపింది. ప్రొఫెసర్ రాజగోపాల్ ఇప్పటికే ఇండియన్ నేషనల్ సైన్స్ అకాడమీ, నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్ ఫెలో అవార్డులకు కూడా ఎంపికయ్యారు.

మాదాపూర్ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం


మాదాపూర్‌లోని కృష్ణ కిచెన్ రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదంతో దట్టంగా కమ్ముకున్న పొగ

హైదరాబాద్ సిటీ, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్‌లోని రెస్టారెంట్‌లో అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. డీమార్ట్ ఎదురుగా ఉన్న కృష్ణ కిచెన్ రెస్టారెంట్‌లో బుధవారం మధ్యాహ్నం ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. దీంతో అందులో ఉన్న కస్టమర్లు, వర్కర్లు భయంతో బయటకు పరుగులు తీశారు. అప్రమత్తమైన రెస్టారెంట్ యాజమాన్యం ఫైర్ సేఫ్టీ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ అధికారులు ఘటన స్థలానికి చేరుకున్న మంటలు ఆర్పారు. ఫైర్ ఇంజన్ సహకారంతో మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. అగ్ని ప్రమాదంతో పరిసర ప్రాంతాల్లో దట్టమైన పొగ అలముకుంది. అగ్ని ప్రమాదంతో రెస్టారెంట్‌లో ఉన్న ఫర్నీచర్ చాలా వరకు కాలిపోయిందని, ఈ సంఘటనలో ఆస్తి నష్టం తప్ప, ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదని పోలీసులు తెలిపారు. రెస్టారెంట్ నిర్వాహకులు అప్రమత్తంగా వ్యవహరించడంతో అందులోని వారంతా బయటకు వచ్చేయడంతో ఎవరికీ ఏమీ కాలేదని, అగ్ని ప్రమాదానికి గల కారణాలపై విచారణ చేస్తున్నామని పోలీసులు తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో యువకుడి ఆత్మహత్య

మాదాపూర్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): మాదాపూర్ అరుణోదయ కాలనీలో ఓ హోటల్‌లో యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మాదాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో బుధవారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం నిమ్మ వంశీకృష్ణారెడ్డి(25) ఇంజనీరింగ్ పూర్తి చేసుకొని ఉద్యోగం అవకాశాల కోసం ప్రయత్నం చేస్తున్నాడు. మంగళవారం ఉదయం ఓ క్యాబ్ తీసుకొని బయటకు వెళ్లిన వంశీ హోటల్ రూంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఆత్మహత్యకు ఆర్థిక ఇబ్బందులే కారణమని ప్రాథమికంగా పోలీసులు గుర్తించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియాకు తరలించారు. పోలీసులు కేసు నమోదుచేసుకొని పూర్తి స్థాయిలో దర్యాప్తు చేస్తున్నారు.

చోరీల నియంత్రణకు చర్యలు



ఆటోను ప్రారంభిస్తున్న సీఐ విజయ్‌వర్ధన్

పేట్‌బషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): పేట్‌బషీరాబాద్ పోలీసులు సంక్రాంతి పండుగను దృష్టిలో పెట్టుకుని, చోరీలు జరగకుండా నియంత్రించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రజలకు చోరీలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయడానికి బుధవారం సీఐ విజయ్‌వర్ధన్ ఆటోను కాలనీల్లో తిరిగేందుకు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండుగ సీజన్‌లో ఊరు వెళ్లే ప్రజలు తగు జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. కాలనీల్లో అపరిచిత వ్యక్తులు కనబడితే 100 డయల్‌తో పాటు 8712663248, 9490617229, 871266324 నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడు మృతి

పేట్‌బషీరాబాద్, జనవరి 8(ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద స్థితిలో కాంట్రాక్టర్ కార్మికుడు విద్యుత్ స్తంభం ఎక్కి మృతి చెందాడు. పేట్‌బషీరాబాద్ ఎస్ఐ మహేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాలు ప్రకారం అదిలాబాద్ జిల్లా, చెన్నూరు మండలం, దుబ్బగూడెం గ్రామానికి చెందిన దుర్గం కుమార్ (30) బతుకుదెరువు కోసం వలస వచ్చి శామీర్‌పేటలో ఉంటూ, గుండ్లపోచంపల్లి సబ్-స్టేషన్‌లోని విద్యుత్ కాంట్రాక్టర్ కార్మికుడుగా పని చేస్తున్నాడు. సబ్-స్టేషన్ పరిధిలో విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపులో మల్లారెడ్డి కాలేజీలో విద్యుత్ స్తంభం ఎక్కి చెట్ల కొమ్మలను తొలగిస్తున్నాడు. ఒక్కసారిగా మనోహర్ తల కిందికి వేలాడుతూ కనిపించింది. అది గమనించిన ఏఈ అతడిని కిందకు దించాడు. అప్పటికే మనోహర్ వాంతులు చేసుకొని మరణించాడు. తోటి కార్మికులు, స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని గాంధీకి తరలించారు.

మనోవేదనతో వ్యక్తి ఆత్మహత్య


మనోహర్ (ఫైల్)

పేట్‌బషీరాబాద్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): తాత మరణించాడని మనోవేదనకు గురై ఒకరు ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పేట్‌బషీరాబాద్ పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం కొంపల్లి మున్సిపల్‌లోని శివాలయం సమీపంలో నివాసం ఉంటున్న రమేష్ కుమారుడు సిరిగాద మనోహర్ (27)గత రెండు సంవత్సరాల నుంచి ఉద్యోగం లేక ఖాళీగా ఉంటున్నాడు. ఇటీవల అతని తాత అనారోగ్యంతో మరణించాడు. అప్పటి నుంచి అతడు మనోవేదనకు గురైనాడు. ఈ నెల 7న రాత్రి భోజనం చేసిన తర్వాత బెడ్‌రూమ్‌లోకి వెళ్లి మనోహర్ ఉరి వేసుకొని ఆత్మ హత్య చేసుకున్నాడు. ఉదయం అతడు లేవకపోవడంతో కుటుంబ సభ్యులు తలుపు తెరిచి చూడగా మృతి చెంది కనిపించాడు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు బెడ్‌రూమ్‌లో వెతకగా సూసైడ్ నోట్ దొరికింది. అందులో ఐయామ్ సారీ మమ్ అండ్ డాడీ అని రాసి ఉంది. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని, మృత దేహాన్ని గాంధీకి తరలించారు.

చైనా మాంజా విక్రేతపై కేసు

గాజులరామారం, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం నిషేధించిన చైనా మాం జాలు విక్రయిస్తున్న వ్యక్తిని సూరారం పోలీసులు పట్టుకొని, కేసు నమోదు చేశారు. ఎస్ఐ వెంకటేశం తెలిపిన వివరాల ప్రకారం సూరారం విలేజ్ నివాసి ఈశ్వర్‌రావు(49) గుట్టుచప్పుడు కాకుండా చైనా మాంజాలు విక్రయిస్తున్నాడు. స్థానికులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని నంబరు 18 చైనా మాంజాలు స్వాధీనం చేసుకొని, ఈశ్వర్‌రావుపై కేసు నమోదు చేశారు.

కుటుంబ కలహాలతో గృహిణి అదృశ్యం


అదృశ్యమైన ఎస్తేరమ్మ

దుండిగల్, జనవరి 8 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఓ గృహిణి ఇంటి నుంచి బయటకువెళ్లి ఇప్పటివరకు తిరిగి రాలేదు. అన్నిచోట్ల వెతికినా ఫలితం లేకపోవడంతో దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం దుండిగల్ మండల కార్యాలయం వద్ద టీషాపు నిర్వహిస్తున్న యల్లమందయ్య, ఎస్.ఎస్తేరమ్మ(45)లు భార్యభర్తలు. ఈ నెల 5వ తేది రాత్రి మద్యం తాగి వచ్చిన యలమంద భార్యను కొట్టాడు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన ఆమె రాత్రి 11 గంటల సమయంలో ఇంటి నుంచి బయటకు వెళ్లింది. ఇప్పటి వరకు తిరిగి రాలేదు. దుండిగల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసునమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.